క్లుప్తంగా

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామును మూలమూర్తికి అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను నిత్యకల్యాణ మండలపంలో కొలువు దీర్చి వివిధ రకాల ఆభరణాలు, సుగంధభరిత పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊజంల్‌సేవ జరిపారు.

వేడుకగా జెండా ఉత్సవం



సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ

కోట: మండలకేంద్రంలో శనివారం ఆంజనేయ స్వామి జెండా ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక సోమేశ్వరాలయం నుంచి ఆంజనేయస్వామి జెండా ఉత్సవం కోటలో వేడుకగా సాగింది. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఈ సందర్భంగా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసి, జెండా ఉత్సవంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ వినోద్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్ పాల్గొన్నారు.

సన్మానం



గూడూరురూరల్: పట్టణంలోని సనత్ నగర్‌లో ఉన్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ నివాసానికి ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు శనివారం వెళ్లి, ఆయన్ని సన్మానించారు. శాసన మండలిలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌కు ప్రభుత్వ విప్‌గా పదవి రావడం సంతోషంగా ఉందన్నారు.


డీవీ సత్రంలో వర్షం

దొరవారిసత్రం: మండలంలో శనివారం సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. అప్పుడప్పుడు కురుస్తున్న వానలకు ఇప్పటికే పలు చెరువుల్లోకి సాగు నీరు చేరాయి. వ్యవసాయ పనులు పలు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. తల్లంపాడు, లింగంపాడు, తనియాలి, బూదూరు, వెదురుపట్టు తదితర గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో నాట్లు వేసేందుకు పొలాన్ని సిద్ధం చేసే పనిలో రైతులు ఉన్నారు. కురుస్తున్న వానలకు నెర్రికాలువ, కన్నకాలువ, పాలకాలువలు సాగు నీటితో ప్రవహిస్తున్నాయి.

ఆలయాలకు నవరాత్రి శోభ



విద్యుద్దీపాలంకరణలతో చెంగాళమ్మ ఆలయం



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విద్యుత్ వెలుగులు

సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మ ఆలయం శరన్నవరాత్రులకు సుందరంగా ముస్తాబైంది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. స్థానిక అయప్ప ఆలయం నుంచి చెంగాళమ్మ అమ్మవారి దేవస్థానం వరకు వివిధ దేవతామూర్తుల కటౌట్లు, విద్యుద్దీపాల ఆర్చిలు ఏర్పాటు చేశారు. 15వ తేదీ న అమ్మవారు పరమేశ్వరీ అలంకారం, 16న గాయత్రి ,17న అన్నపూర్ణ, 18న మహాలక్ష్మి, 19న అష్టకాళి, 20వ తేదీన సరస్వతి, 21న బాలత్రిపుర సుందరి, 22న దుర్గాదేవి అలంకారాలుంటాయన్నారు.

కనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో..

చిల్లకూరు: మండలంలోని ముత్యాలమ్మ, కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చి దిద్దారు. ఆలయాల్లో తొలి రోజు గణపతి పూజ, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, కలశ స్థాపన నిర్వహించనున్నారు.



పెంచలకోనలో విద్యుత్ దీపాలంకరణ

పెంచలకోనలో ఏర్పాట్లు పూర్తి

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఆదిలక్ష్మీదేవి సన్నిధిలో ఆదివారం నుంచి 24వ తేదీ వరకు జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు పెంచలకోన ముస్తాబైంది. ఆలయాల ప్రాంగణంలో విద్యుత్ దీపాలంకరణ, స్వామి,అమ్మవార్ల ఆర్చిలు ఏర్పాటు చేశారు.

సైదాపురంలో..

సైదాపురం: మండల కేంద్రంలోని బాలత్రిపుర సుందరీ దేవి ఆలయంలో ఆదివారం నుంచి 23వ తేదీ వరకు శరన్నవ రాత్రిమహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వరప్రసాద్ తెలిపారు.

మల్లాంలో..

చిట్టమూరు: మండలంలోని మల్లాంలో ఉన్న కామాక్షీదేవి సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని అర్చకుడు గూడలి సుధీర్ శర్మ శనివారం తెలిపారు. ఆలయంలో ప్రతి రోజు అమ్మవారికి వివిధ అలంకారాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

అంకాళమ్మ ఆలయంలో..

రాపూరు: వేపినాపి సమీపంలోని పోతుకొండపై ఉన్న అంకాళమ్మ ఆలయంలో ఆదివారం నుంచి శరన్నరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆభరణాల బహూకరణ



ఆభరణాలను అందజేస్తున్న ఏఈ శ్రీనివాసులు, (ఇన్‌సెట్) ఆభరణాలు

నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగలో ఉన్న అభయ అనుగ్రహ వేంకటేశ్వరస్వామివారికి నాయుడుపేట మండల హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు తన కుటుంబ సభ్యులతో కలసి స్వామివారికి సుమారు రూ.40 వేలకుపైగా విలువ చేసే కిరీటం, ఆభరణాలను బహూకరించారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కలువాయి: పిచ్చికుక్క దాడిలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గాయపడిన వారిని కలువాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన కుక్కను గ్రామస్తులు కొట్టి చంపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన పోలయ్య

నాయుడుపేటటౌన్: మండలంలోని పుదూరు సమీపంలో రహదారిపై శనివారం మోటారుసైకిల్‌ను మిని ట్రక్కు వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న పీ పోలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు.. నాయుడుపేటలో నివాసం ఉన్న పోలయ్య బెల్దారీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో శనివారం ద్విచక్రవాహనంలో అరవపెరిమిడి గ్రామంలో జరుగుతున్న పనులు వద్దకు బయలు దేరాడు. మార్గం మధ్యలో పుదూరు రోడ్డు దాటిన తరువాత మినిట్రక్కు ఒక్కసారిగా రోడ్డుగా అడ్డంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో పోలయ్య గాయపడ్డాడు. అతడిని నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

రాపూరులో..

రాపూరు: స్థానిక ఇందిర కాలనీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు కథనం మేరకు.. సూరాయిపాళేనికి చెందిన ప్రవీణ్ సిద్ధవరం గ్రామానికి మోటారు సైకిల్‌లో వెళుతూ ఇందిర కాలనీ వద్ద ఆగి ఉన్న కారును ఢీకోనడంతో గాయపడ్డాడు. 108 సిబ్బంది క్షతగాత్రుడిని రాపూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చిల్లకూరులో మరొకరికి..

చిల్లకూరు: మండలంలోని జాతీయ రహదారిపై చిల్లకూరు సమీపంలో శనివారం కారు, ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తా పడి ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గూడూరు రూరల్‌కు చెందిన వరప్రసాద్ అనే వ్యక్తి జెండా ఉత్సవానికి చిల్లకూరులో బాణాసంచా కొనుగోలు చేసి, తిరిగి గూడూరుకు బయలుదేరాడు. జాతీయ రహదారి పైకి వచ్చే సరికే వన్‌వే ఉండడంతో అదే మార్గంలో వస్తున్న కారు ఆటోను ఢీ కొంది దీంతో ఆటో బోల్తా పడడంతో అతనికి గాయాలయ్యాయి.

ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు

సైదాపురం: ఓ కారు ఎదురుగా వస్తున్న లారీని తప్పించే యత్నంలో అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన సంఘటన శనివారం మండలంలోని చాగణం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రాజుపాళెం గ్రామానికి చెందిన పలువురు పనుల నిమిత్తం మర్లపూడి గ్రామానికి వెళ్లి మారుతి వాహనంలో తిరిగి వస్తున్న సమయంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న లారీని తప్పించేందుకు యత్నించడంతో కారు అదుపు తప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో స్థానికులు కారును బయటకు తీసి, అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులను కాపాడారు.

పక్షుల సంరక్షణ తప్పనిసరి

సూళ్లూరుపేట రూరల్: మానవ సమాజంలో పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సంరక్షణ తప్పనిసరి అని డీఎఫ్ఓ పెరుమాళ్ల శామ్యూల్ తెలిపారు. సూళ్లూరుపేట పర్యావరణ, అటవీశాఖ సబ్ డివిజన్ డీఎఫ్ఓ కార్యాలయంలో శనివారం అవగాహన కల్పించారు.

పద్మనాభరెడ్డి ఉత్తర క్రియల్లో పాల్గొన్న నేతలు

వాకాడు: వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యుడు డాక్టర్ నేదురుమల్లి పద్మనాభరెడ్డి ఉత్తర క్రియల్లో శనివారం ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. పద్మనాభరెడ్డి చిత్రపటానికి నేతలు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం పద్మనాభరెడ్డి సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు వెలగపల్లి వరప్రసాద్‌రావు, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సీఈసీ సభ్యులు యల్లసిరి గోపాల్‌రెడ్డి, కే ధనుంజయరెడ్డి, నెల్లూరు ఉపమేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సీ దేవకుమార్‌రెడ్డి, కే సుబ్బారెడ్డి, కే దామోదర్‌రెడ్డి, పీ మనోజ్‌కుమార్‌రెడ్డి, కే భాస్కర్ రెడ్డి, పీ రాజశేఖర్‌రెడ్డి, జీ సుధాకర్‌రెడ్డి, పీ కోటిరెడ్డి, పీ కృష్ణయ్య, చంచలబాబుయాదవ్, తదితర నాయకులు పద్మనాభరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు.





నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

తొమ్మిది మంది జూదరుల అరెస్టు



నిందితులతో సెబ్ అధికారులు

వెంకటగిరిరూరల్: చట్ట విరుద్ధంగా సింగిల్ నంబర్ జూదం ఆడుతున్న నిర్వాహకులపై సెబ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు చేసి, ఏడుగురిని అరెస్టు చేశారు. సెబ్ సీఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. పట్టణంలోని తోలిమిట్టలో ఉన్న శ్రీరాముల ఆలయం వద్ద, మరో వ్యక్తి ఇంటి ముందు వేర్వేరుగా సింగిల్ నంబర్ జూదం నిర్వహిస్తున్నట్లు సెబ్ అధికారులకు సమాచారమందింది. దీనిపై స్పందించిన ఆయన తమ సిబ్బందితో దాడులు చేశారు. శ్రీరాముల వారి ఆలయం వద్ద జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 23 వేలు, నగదు, 4 సెల్‌పోన్లు, స్లిప్‌లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే తోలిమిట్టలోని మరో వ్యక్తి ఇంటి ముందు లాటరీ ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు వారి వద్ద నుంచి రూ. 13 వేలు నగదు, 3 సెల్‌ఫోన్లు, స్లిప్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెబ్ కానిస్టేబుళ్లు మునిశేఖర్, పుట్టయ్య, పుల్లయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

టీ దుకాణంలో అగ్ని ప్రమాదం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న టీ దుకాణంలో శనివారం గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు రేగి, దుకాణం అంటుకుంది. ఈ ఘటనలో దుకాణ యాజమాని మదన్‌సింగ్ స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలు అదుపు చేశారు. దుకాణంలోని వస్తువులు, క్యాష్ కౌంటర్‌లో నగదు కాలిపోయాయి. సుమారు రూ.80 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.